

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# బెస్ట్ ఫ్రెండ్

సాయంత్రం నాలుగు గంటలవుతోంది.

విశాలాక్షమ్మ గది తలుపు తీసి వీధిలోకి తొంగి చూసింది. ఇంకా ఎండ వేడి తగ్గలేదు. కాని నలుగురు పిల్లలు రోడ్డు మీదనే క్రికెట్ ఆడుతున్నారు. వాళ్ళను చూస్తే విశాలాక్షమ్మ కోపం... విసుగు, 'వెధవలు, చదువూ సంధ్యా ఏమీ ఉండదు... రోజంతా ఆ బంతిని కొట్టుకుంటూ కూర్చుంటారు...' అని గొణుక్కుంది.

బంతి వచ్చి ఠపీమని గోడకు తగిలి ఆమె కాళ్ళముందు పడింది. ఒక పిల్లాడు రివ్వున వచ్చి బంతి అందుకుని పరుగెత్తాడు. ఆమె ఈసారి పెద్దగానే తిట్టింది. వాళ్ళు వినిపించుకోలేదు. 'నోబాల్....' అని అరుచుకుంటున్నారు.

స్కూలు నుంచి ఒక చిన్న పిల్ల స్కూలు డ్రెస్‌లో, వీపునకు బ్యాగ్, వాటర్‌బాటిల్ తగిలించుకుని వాటి బరువుకు కొంచెం ముందు వంగి నడుస్తోంది. బంతి వచ్చి ఈసారి ఆ పిల్ల భుజానికి తగిలింది. ఆ అమ్మాయి 'బేర్'మని ఏడుపు లంకించుకుంది. విశాలాక్షమ్మ ఈసారి చూస్తూ ఊరుకోలేకపోయింది. ఆ కుర్రాళ్ళను తిట్టి పంపించివేసింది. ఆ పిల్లను దగ్గరకు తీసుకొని ''ఏడవకు... వాళ్ళు మనుషులు కాదు, గాడిదలు... అడ్డ గాడిదల్లా పెరిగారు... మనుషులు తిరిగే చోటనా ఆటలు? ... మా తల్లే... ఎంత దెబ్బ తగిలింది?'' అంటూ ఓదార్చింది.

ఆ పిల్లను లోపలికి తీసుకెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టింది. మంచినీళ్ళు ఇచ్చింది. ఏడుపు మొహం కడుక్కునేందుకూ నీళ్ళు ఇచ్చింది.

''నీ పేరేంటి?'' అని అడిగింది.

''పావని..''

''ఏం చదువుతున్నావమ్మా?....''

''సెకెండ్ క్లాస్...''

''మీ ఇల్లు ఎక్కడా?...''

''ఇటెల్లి అటెల్లాలి...''

''మీ నాన్న ఏం చేస్తాడు...?''

''బ్యాంక్ మేనేజర్...''

వాళ్ళమ్మ కూడా ఉద్యోగం చేస్తుందనీ, ఇద్దరూ సాయంత్రం ఆరింటికి గానీ స్కూటర్ మీద ఇంటికి రారనీ చెప్పింది పావని. అయితే కాసేపు కూర్చోమని చెప్పింది.

విశాలాక్షమ్మ కాఫీ తాగుతూ, పావనికి కాఫీ ఇచ్చింది. పావని తాగింది.

''మరి మీ అమ్మానాన్నా వచ్చేదాకా ఎక్కడుంటావు?''

''గుమ్మం ముందు కూర్చొని హోంవర్క్ చేసుకుంటా...''

''చిన్నపిల్లవు... ఒక్కదానివీ ఆరుగంటల దాకా అట్లా తిండీ తిప్పలూ లేకుండా గుమ్మం ముందు పడి ఉంటావా? ఏం ఉద్యోగాలో... ఏం సంపాదనలో...పిల్లల ఆలనా పాలనా చూసే దిక్కులేకపోయాక... ఎంత సంపాదించినా ఏం ప్రయోజనం?..'' అని విశాలాక్షమ్మ సగం స్వగతంగానూ, సగం ఆ పిల్లతోనూ అన్నది.

పావని కాసేపు కూర్చుని వెళ్ళిపోయింది.

విశాలాక్షమ్మకు మనవరాలు గుర్తొచ్చింది... దీప్తి... అదీ ఇలాగే ఉంటుంది... ఆ పిల్లమీద ఆమెకు వల్లమాలిన మమకారం. దాన్ని తన దగ్గరే ఉంచుకోవాలని ఆమె ఆరాటం. దాన్ని ఈమె దగ్గరా ఉంచరు. ఈమెను ఆ పిల్ల దగ్గరా ఉండనివ్వరు.

విశాలాక్షమ్మను చూస్తే కోడలుకు కోపం. ''ముసలాళ్ల దగ్గరకు పిల్లల్ని చేరనిస్తే వాళ్ల బుద్ధులు, వాళ్ళ అలవాట్లు – అవే అబ్బుతాయి... పిల్లలకు ఈ అలవాట్లు మాన్పటం కష్టం... అందుకని అసలు పిల్లల్ని ముసలాళ్ల దగ్గరకు చేరనివ్వకూడదు...'' అని కోడలు స్పష్టంగా కొడుకుతో చెప్పటం విన్నది.

కోడలు తనను అలా పనికిమాలిన మనిషిగా చిత్రించటం ఒక ఎత్తు అయితే, కొడుకు మౌనంగా కోడలు మాటలు ఆమోదించటం మరో ఎత్తు.

బతకటానికి కూడు, గుడ్డ, నీడ అవసరం. మనిషిగా బతకటానికి ఆత్మగౌరవం అంతకన్నా ఎక్కువ అవసరం. అందుచేతనే తన వాళ్ళు అందరూ ఉన్న చోట కాకుండా, విడిగా ఉంటోంది. ఇక్కడ ఫోన్లు లేవు. సోఫాలు లేవు. టీవీలు, స్టీరియోలు లేవు... ఇక్కడ అవమానాలు లేవు. అమర్యాదలు లేవు... ఇక్కడ కూర్చున్నావేం, ఇక్కడ నిలుచున్నావేం – అని విసుక్కునే వాళ్లు లేవరు... ''కాళ్లకు అడ్డం తగులుతున్నావు'' అంటూ కసురుకునే వాళ్లు లేరు.

మర్నాడు నాలుగింటికి మళ్లీ గుమ్మం తలుపు తీసి బయటకొచ్చింది. నిన్న జరిగిన దానికి గొడవ అవుతుందని భయపడ్డారేమో – క్రికెట్ వీరులెవరూ రోడ్డుమీద వీరవిహారం చేయటం లేదు. వాళ్ల అరుపులూ, కేకలూ లేకపోవటంతో వాన వెలిసినట్లుగా ఉంది.

నిన్నటి లాగానే ఆ పిల్ల... స్కూలు యూనిఫాంలో.... వీపున పుస్తకాల సంచీతో, వాటర్‌బాటిల్‌తో కొద్దిగా ముందుకు వంగి నడుస్తూ వస్తోంది.

విశాలాక్షమ్మ పావనిని చూసి నవ్వింది. ఆ పిల్ల ఆగిపోయింది. జేబులో నుంచి చాక్లెట్ తీసి ఆమెకిచ్చింది.

"ఏంటి?" అని అడిగిందామె.

"నిన్న మీరు నాకు బంతి తగిలితే హెల్ప్ చేశారుగా... అందుకని..." అన్నది పావని.

విశాలాక్షమ్మ పావనిని లోపలికి తీసుకెళ్లింది. కుర్చీలో కూర్చోబెట్టింది. మంచినీళ్లు అందించింది....

ఒకరోజు తన మనమరాలు లడ్డూ తింటూ తల్లి దగ్గర నుంచి తన దగ్గరకు వచ్చింది. ప్రేమగా ఒళ్ళో కూర్చోబెట్టుకుంది తను. మనుమరాలు లడ్డు తన నోట్లో పెట్టింది... వెనక నుంచి కోడలు గొంతు వినిపించింది.

"పసిపిల్ల ఇచ్చేది తీసుకోవటానికి సిగ్గు ఉండాలి..." అని...

గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లు అయిందామెకు. ఆ దృశ్యం గుర్తొచ్చి విశాలాక్షమ్మకు కళ్లంట నీళ్ళు తిరిగాయి.

ఇలాంటి అవమానాలు ఎన్నో భరించింది...

"ఎందుకు బామ్మా ఏడుస్తున్నావు?" అని అడిగింది పావని.

"ఏం లేదు" అని కన్నీళ్ళు తుడుచుకుందామె.

పావని పై కాగితం తీసేసి చాక్లెట్ ఆమె నోటికి అందించింది. ఆమెకు మనుమరాలే గుర్తొచ్చి పావనిని ముద్దుపెట్టుకొంది.

"పసిపిల్లలు దేవతలతో సమానం" అన్నది.

పావనికి కాఫీ ఇచ్చింది. ఇంటికి వెళ్తానని లేచింది.

"మీ అమ్మానాన్నా వచ్చేదాకా, ఇక్కడే కూర్చుని హోం వర్క్ చేసుకోమ్మా... నీకు నేను తోడు... నాకు నువ్వు తోడు..." అన్నది విశాలాక్షమ్మ.

పావని సంచీలో నుంచి పుస్తకాలు తీసుకుని ముందుపరచుకుని దానిమీదకు వంగిపోయి లెక్కలు చేసుకుంటోంది.

"అలా కాదు... ఆ బూట్లు తీసేసి.. కుదురుగా కూర్చో" అని చెప్పింది.

"చదువుకునేటప్పుడు అలా కాళ్ళు వెనక్కి మడిచి కూర్చోకూడదు, మంచి అలవాట్లు నేర్చుకోవాలి..." అని చెప్పింది విశాలాక్షమ్మ.

"దేనికి?" అని అడిగింది పావని.

"మన అలవాట్లే మన జీవితాలను మార్చేస్తాయి"

"ఎలాగా?" అని అడిగింది పావని.

"ఒక అబ్బాయి ఒక కంపెనీ యజమాని గదిలోకి వెళ్లి ఉద్యోగం ఇవ్వమని వినయంగా అడిగాడు. ప్రస్తుతం ఖాళీలేవు, వెళ్ళిపొమ్మన్నాడు. ఆ కుర్రాడు వెళ్ళేందుకు వెనక్కి తిరిగాడు. కింద గుండుసూది కనిపించింది. అది తీసి అతను యజమాని టేబుల్‌మీద ఉన్న పిన్ కుషన్‌లో పెట్టాడు. 'నాకు గుచ్చుకోలేదు, ఎవరికైనా గుచ్చుకోవచ్చు' అన్నాడా కుర్రాడు. ఆ యజమాని అతని అలవాట్లకు సంతోషించి 'మాకు నీలాంటి వాళ్ళు కావాలి' అంటూ అంతకుముందు ఉద్యోగం లేదన్న పెద్దమనిషే ఆ కుర్రాడికి ఉద్యోగం ఇచ్చాడు. ఇది మన అలవాట్లు మనకు ఎలా మంచి చేస్తాయో చెప్పే కథ..." అన్నదామె.

"అలవాట్లు మనకు ఎలా చెడు చేస్తాయో... అదీ చెప్పు బామ్మా..." అని అడిగింది పావని.

"ఒక తేలు నది ఒడ్డున ఉంది. నది దాటడం చేత కావటం లేదు. అక్కడికి వచ్చిన తాబేలును అడిగింది. నది దాటించమని. నిన్ను వీపు మీద ఎక్కించుకుని నది దాటిస్తూ ఉంటే మధ్యలో నువు కుడితే ఎలాగా – అని అడిగింది తాబేలు. 'అలా కుడితే నీతోపాటు నేనూ మునుగుతాను. అలాంటి పని నేను ఎందుకు చేస్తాను' అన్నది తేలు. తాబేలు సరేనంది. తేలు తాబేలు వీపుమీదకు ఎక్కింది. తాబేలు నీళ్ళమీద ఈదుతోంది. సగం దూరం వచ్చాక తేలు కుట్టింది. తాబేలు నీళ్లలోకి మునిగింది. తేలు కూడా మునిగింది. అప్పుడు తాబేలు తేలును అడిగింది. 'కుడితే నాతోపాటు నువ్వూ మునిగిపోతావని

తెల్సు.. అయినా ఎందుకు కుట్టావు?' అని అడిగింది. అలవాటు కొద్దీ చేశాను.. అని చెప్పింది తేలు... అంటే ఏమిటన్నమాట చెడు అలవాట్లు చేసుకోకూడదు. వాటివల్ల మనకే నష్టం...' అని చెప్పిందామె.

పావనికి విశాలాక్షమ్మకు అలా స్నేహం కలిగింది. రోజూ రెండు గంటలు కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పుకొనేవాళ్ళు. ఆమె చెప్పే విషయాలన్నీ పావనికి ఎంతో విజ్ఞానదాయకంగా ఉండేవి. పావని ఆమె దగ్గర తెల్సుకున్న విషయాలు స్కూల్లో మిగిలిన పిల్లలకు చెబితే వాళ్లంతా పావనిని ఎంతో గొప్పగా చూసేవాళ్ళు.

ఆ రోజు పావని పుట్టినరోజు. కొత్త బట్టలు కట్టుకొని ముఖానికి సంతోషాన్ని పులుముకొని స్వీట్స్ తీసుకుని వచ్చింది. పావని తల్లి కూడా వచ్చింది.

పావని తల్లి చెప్పింది "మా అమ్మాయి మీ గురించి రోజూ ఎన్నో విషయాలు చెబుతుంది. నిజానికి మేం మా అమ్మాయితో కనీసం గంటసేపు అయినా గడపలేకపోతున్నాం. తల్లీ దండ్రీ దగ్గరుండీ మంచీ చెడూ చెప్పాల్సిన సమయం ఇది. కానీ మేం వచ్చేటప్పటికి ఆలస్యం అయిపోతుంది. రాగానే మళ్ళీ వంటావార్పూ... మేం భోజనాలు చేసే సమయానికి పిల్ల నిద్రపోతుంది... ఇంక దానికి ఏమీ చెప్పే టైమే ఉండటం లేదు" అన్నదామె.

"పిల్లల్ని పెంచి పెద్దచేసి చదువులు చెప్పించేందుకు డబ్బూ అవసరమే... ఇప్పుడు మీరు కష్టపడి సంపాదిస్తున్నదంతా పిల్లకోసమే కదా... నేనూ ఒంటరిదాన్ని... నాకూ కాలక్షేపం కావాలి కదా... అందుచేత రోజూ మీరుఇంటికొచ్చే దాకా పాపను నేను చూసుకుంటాను..." అన్నది విశాలాక్షమ్మ.

"బామ్మా నీకెన్నేళ్ళు?" అని అడిగింది పావని.

"నాకే! మూడు ఇరవైలు..." అని చెప్పిందామె.

"అంటే అరవై అన్నమాట..."

"ఇంతకుముందు నా వయస్సు అరవై అనే అనుకునేదాన్ని. నీతో స్నేహం కలిసాక నా వయసు ఇరవయ్యేననిపిస్తోంది..." అన్నది విశాలాక్షమ్మ.

సాయంత్రం పావనిని తనతో తీసుకెళ్లి డ్రెస్ కొన్నది. పావని ఆ డ్రెస్ వేసుకుని ఆమెతో కల్సి ఫోటో తీయించుకుంది.

ఆ ఫోటో విశాలాక్షమ్మ ఇంట్లో పెట్టుకుంది.

ఒకసారి ఇలాగే దీప్తి పుట్టిన రోజు తనుడ్రెస్ కొన్నది. కోడలికి నచ్చలేదు. 'ముష్టి డ్రెస్... ఎవడిక్కావాలి?" అంటూ తన ముందే వాటిని విసిరేసింది.

తన కోడలికీ, పావని తల్లికీ గల తేడాను బేరీజు వేసుకుని చూసుకుంటోందామె. ఇక్కడ అనుబంధం లేదు. ఆత్మీయత ఉంది.

ఒకరోజు విశాలాక్షమ్మ కొడుకూ, కోడలూ వచ్చారు. చూసిపోదామని. పావని ఫోటో చూశారు. 'ఎవరూ!' అని అడిగాడు కొడుకు.

"ఎవరో దారిన పోయే అమ్మాయి... పలకరించాను... కాలక్షేపం కోసం స్నేహం చేశాను" అని చెప్పిందామె.

"ముసలామెకూ పసిదానికీ స్నేహం ఏమిటీ?" అని నొసలు చిట్లించింది కోడలు. "స్నేహానికి సమానమైన వయస్సు ఉండాలి..."

"నా వయస్సులో ఉన్న వాళ్ళంతా నాతో స్నేహం చేయమంటే చేస్తారా? ఆ పిల్లకు నా మీద గురి. నాకు అదంటే ఇష్టం.. అంతే..." అన్నది విశాలాక్షి.

"అంతేలెండి. ముందొచ్చిన చెవులకన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి అని అసలు మనవరాలు కన్నా ఈ దారిన పోయేది ఎక్కువ అయింద. ఈ ప్రేమలూ, అభిమానాలు ఎన్నాళ్లు ఉంటాయో నేనూ చూస్తాను..." అన్నది కోడలు.

విశాలక్షమ్మ నిట్టూర్చింది. కాలమే సమాధానం చెబుతుందని మనసులోనే అనుకొంది.

పావని తల్లికీ, తండ్రికీ ట్రాన్స్‌ఫర్ అయింది. ఇద్దరూ ఊరు విడిచి వెళ్తున్నారు. ఆ విషయం చెప్పటానికి వచ్చారు. ఆమె మనసు బాణం దెబ్బతిన్న లేడిలాగా గిలగిల్లాడిపోయింది.

"దేవుడు ఒక తలుపు మూసేసినా మరో తలుపు తీశాడని సంతోషించాను... ఆ సంతోషమూ మూడు నాళ్ళ ముచ్చటే అయింది..." అని బాధపడిందామె.

పావని తల్లి తన మనసులోని మాట చెప్పింది. "దీని చదువు సంగతే మాకు ఏమీ తోచటం లేదు. సంవత్సరం మధ్యలో అక్కడ అడ్మిషన్ దొరకదు. మీరు ఏమీ అనుకోకపోతే పాపను మీ దగ్గర ఉంచుకోండి. దాని ఖర్చుకు డబ్బు పంపిస్తాం..."

"పావనిని నా దగ్గర ఉంచుకోవటం కన్నా నాకింకేం కావాలి? దాన్ని కంటికి రెప్పలా చూసుకుంటాను. మీరు నిశ్చింతగా ఉండండి... డబ్బు మాత్రం తీసుకోను.. అది నా మనుమరాలు..." అన్నదామె.

పావని విశాలాక్షమ్మ దగ్గరే ఉండి చదువుకుంటోంది.

ఈ విషయం తెల్సి కొడకూ కోడలూ వచ్చారు.

"ఈ వయస్సులో ఈ లంపటాన్ని తగిలించుకున్నావేంటి? ఈ మనుషులు కలుస్తుంటారు, విడిపోతుంటారు. ఈ స్నేహాలు శాశ్వతమా? ... ఆ పిల్లను పంపించెయ్యి. నీ అసలు మనమరాలినే దగ్గర పెట్టుకో..." అన్నాడు కొడుకు.

"నేను ముసలిదాన్ని... నాగరికత తెలియని దాన్ని.. మీ పిల్లను మీ స్థాయికి తగినట్లుగా పెంచలేను. అంచేత మీ అమ్మాయిని నా దగ్గర ఉంచుకునే స్థోమత నాకు లేదు. నాకు కాలక్షేపం కోసం.. ఈ పిల్లను ఉంచుకున్నాను.. నా అవసరం నాది... వాళ్ల అవసరం వాళ్లది... " అన్నది విశాలాక్షమ్మ.

అలా ఒకటి.. రెండు.. మూడు.. ఏళ్ళు గడిచాయి. విశాలాక్షమ్మ పావనిల మధ్యస్నేహం బాగా ముదిరిపోయింది. ఒకరిని చూడకుండా మరొకరు ఉండలేని స్థితికొచ్చారు.

పావనికి ఇరవై ఏళ్లు వచ్చాయి. సంబంధం చూసింది. పెళ్లి చేసింది... ఖర్చు ఆమే భరించింది.

పావని నాయనమ్మ కాని నాయనమ్మను కౌగలించుకొని ఏడ్చింది గానీ... తల్లినీ, తండ్రినీ విడిచి వెళ్తున్నందుకు ఏడవలేదు.

"నువ్వు నా బెస్ట్ ఫ్రెండ్‌వి" అన్నది పావని ఆమె భుజం మీదకు వాలిపోయి.

"ఆస్తులు, ఐశ్వర్యాలు లాగానే మంచి స్నేహితులు దొరకటమూ ఒక అదృష్టమే.. ఆడపిల్లకు భర్తను మించిన బెస్ట్ ఫ్రెండ్ ఉండదు.... ఇప్పుడు నీకు అసలైన బెస్ట్ ఫ్రెండ్ దొరికాడు. అతనే నీకు అన్నీ..." అన్నది విశాలాక్షమ్మ పావని చేతిని పెళ్ళికొడుకు చేతిలో పెడుతూ.

★★★★

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.